"హేయ్ హేయ్ మావయ్యా, మొత్తంమీద నా రాయబారం చెడగొట్టేశావ్। మరి 'జెండాపై కపిరాజు' పద్యం బాగా గుర్తుంచుకో।"

అని శ్రీకృష్ణమూర్తి ధృతరాష్ట్రుణ్ణి రహస్యంగా కలుసుకొని వార్నింగ్ యిచ్చేడు.

ఓయి ధూర్త గోపాలస్వామీ! నిజంగా రాయబారం వ్యర్థం కావాలనేగా నీ సంకల్పం మాయలమారీచుడివి. నీకు సాధ్యం కానిది ఏంవుందయ్యా ! రక్తపాతం, కట్టెయ్యకు అల్లుడూ! నాకు చిర్రెత్తుకొచ్చిందంటే మా ధర్మరాజునే మినిస్ట్రీ ఫారం చేసెయ్య మనగల్ను. అయితే నువ్వు నాకో చిన్న సాయం చేసిపెడితే నేస్మా"

"హేమిటేమిటీ! నీకూ యింత సాహసం తెగింపూనా! ఏదో ఉపకారం అంటున్నావ్, అది సామాన్యమైనది అయి ఉండదు, ఉద్దండ పిండానివి, ఈతగింజకు తాటిగింజనీ లాగే బాపతు నువ్వు, ఏమిటి సంగతి!"

● జె. జె. మోహనరావు

# భగవంతుడి పాట్లు

సంపూర్ణ విప్లవం తలపెట్టి ఉంటావ్ ! నీ పుణ్యం ఉంటుంది. మా అందరి నెత్తుల మీదా చేతులు పెట్టించకు. కావాలంటే మంత్రివర్గంలో పాండవులకి ఒకటో రెండో స్థానాలు యిప్పిస్తాన్లే. అంతగా కాదు కూడదంటే పి.డబ్ల్యూ.డీ. శాఖని మీ ధర్మరాజునే తీసుకోమను"

"పోవయ్యా, మావయ్యా! రాజ్యాంగ రీత్యా నువ్వు ఒట్టి ఉత్సవ విగ్రహశ్రీవని ఎవరికి తెలీదు గనక!"

"అల్లా నన్ను అల్లాటప్పయ్య క్రింద ధృతరాష్ట్రుడు గొంతుక తగ్గించి దృఢంగా అడిగేడు.

"ఇవాళ నాకోసారి దృష్టి ప్రసాదించాలయ్యా"

"మావయ్యా అసాధ్యం. నువ్వే అజ్ఞానం, అజ్ఞానమేనువ్వు. స్విట్జర్లాండ్‌లో ఆపరేషన్ చేయించినా నీకు కళ్ళురావు. అసలు ఉన్న కళ్ళు శాశ్వతంగామూసేసే కాలం కూడా అట్టే దూరంలో లేదే. ఎవర్ని కన్నుకొట్టాలని ఈ వయసులో నీకిలాంటి కుదరని కోరిక?"

"బాబ్బాబూ అలా అనకయ్యా! ఇటు సాయిబాబా, అటు సర్కారూ, తర్వాత నిన్నే పెద్ద మెజీషియన్‌గా ప్రజలు గుర్తించేశారు! మా నాయనవుకదా! చచ్చి నీ కడుపున, అదే రుక్మిణి కడుపున పుడతాను. ఆ జాంబవతి కడుపున మాత్రం వద్దు, దాని నాన్న పోలిక దిగిపోతే కష్టం మళ్ళీ"

ఈ ముసిలి రాజుకి యింతఅర్జంటుగా యివాళ కంటిచూపు ఎందుకు కావలసి వచ్చిందబ్బా – అని కృష్ణమూర్తికి ఆశ్చర్యము వేసింది. అయినా వీళ్ళనీ ఓ ఆట ఆడించడం ఆయనకి అలవాటు గనుక–

"సగం దూరం మోసేసిన శవం అయినాసరే ఆ నోటిని సాగదీసి ఓ మాత్ర వేస్తే లేచి కళ్ళు నులుపుకుని వెనక్కి పరిగెడతాడని చెప్పబడేది ఒక్క హోమ్యోపతీ వైద్యమే! నీకుచూపుకావాలంటే నేత్రంమూర్ అయిదుకోట్ల పొటన్సీ ఒకటి తీసుకోవాలి....అయితే...."

"ఊఁ అయితే ?"

"చాలా శక్తివంతమైన గుళిక అది. చూపు వస్తుంది గాని నోటిముందు కూడు పడగొట్టుకున్నవాడి వవుతావయ్యా మావయ్యా!"

"నీ లిటిగేషన్ ఏదో తొందరగా చెప్పవయ్యా లిటిల్ కృష్ణా!"

"మరేం లేదు, చూపు ఒకటే రాదు. అది తెచ్చుకున్నందుకు పెనాల్టీగా బాగా ముదిరిపోయిన డయబెటీస్ కూడా వచ్చేస్తుంది. మునపట్లా నువ్వు నీ నోటిని గానుగాడించడం కుదరదు మరి. రోజుకి ముప్పైమూడుసార్లు కాఫీ ఊనపడతావు పంచదార జబ్బు పట్టుకుంటుంది గనక అది లేకుండా కషాయంలా దిగమింగాలి. నీ కళ్ళముందే నీ మూరుగురు కోడళ్ళూ ఐస్‌క్రీమ్ చప్పరిస్తూంటే, కొనితెచ్చుకున్నందుకు, గుడ్లప్పచెప్పి, చూచోవాలి. బంగినిపల్లి మామిడిపళ్ళూ, బాదంహల్వా అంటే పడిచస్తుంది కదా నీ ప్రాణి, ఇక యీ జన్మలో అవి తినకూడదు. అయితే ఓ సదుపాయం లేకపోలే దనుకో."

"ఇంకేం సదుపాయం అల్లుడూ,నోరు చచ్చిపోయాక ?"

"అదిగో నీ నోరు చల్లగా నీ శరీరం చల్లబడ్డాకే అలాంటి సదుపాయం. బతికుండగానే ఏవేం తినాలనుందో ఓ లిస్టు రాసి నీ పెద్దకొడుకు చేతికిచ్చి మరి కాలంచేద్దువుగాని. అవన్నీ నీ తద్దినం నాడు నేను దగ్గిరుండి నీ కొడుకుచేత పెట్టిస్తాను నన్ను నమ్ము.

"ఓ, నిన్ను నమ్మకేం నల్లనయ్య! భక్తుల్ని నున్నగా గుండు గొరిగిన తర్వాతే ఆపదలు తప్పిస్తావు. నిలువు దోపిడీ చేశాకే ఏదో దారి చూపిస్తావు తెలుగుకథల్లో 'ఒరేవ్! నీకు నా ఆస్తి కావాలో,నువ్వుప్రేమించిన ఆ అమ్మాయి కావాలో, ఒకటే దక్కేది, తేల్చుకో'అని కొడుకుని బ్లాక్‌మెయిల్ చేసే పరంథామయ్య బాబులాంటి వాడివి. ఏం చేస్తాం అలాగే కానీ, రానీ దృష్టిని.

ఏమిటి యీ ముసలినక్క తెగింపు! ఒక్కరోజు చూపుకి బతుకంతా ఏకాదశి అయినా పరవాలే దంటున్నాడు!–దీనిభావమేమిటో అని ఆ తిరుమలేశుడే తికమక

పడిపోయాడు. అంతుపట్టక అడిగేశాడు.

ధృతరాష్ట్రుడు కొంచెం సిగ్గు పడినా కన్నయ్య దగ్గిర కక్కేయ్యక తప్పలేదు.

"చూడు అల్లుడూ, రహస్యంస్మా! అసలే నీకు స్త్రీ వ్యసనం ఎక్కువ, ఎక్కడైనా కాలుతో పాటు నోరుకూడాజారేవు గనక. ఇవాళ మంచి తెలుగుసినిమా రిలీజవుతోందిట. ఎవరో తేజోలక్ష్మిట. ఒళ్లు దాచుకోకుండా నటిస్తుందిట. మా వాళ్ళంతా మహ ముచ్చట పడుతున్నారు. మా గాంధారి కూడా పాపం నావల్ల నల్ల కళ్ళజోడు పెట్టేసింది. ఇవాళ ఓ వేళ నే కాదన్నా నా మాట వినేటట్టు లేదు. అసలే యిది అంతర్జాతీయ మహిళా సంవత్సరం. కళ్ళజోడు తీసి విసిరేసిందా దాంతోపాటు మీ అత్త పాతివ్రత్య ప్రతిభ అంతా పటపట ముక్కలై పోతుంది. దాని మాట దేవుడెరుగు! ఆ దివ్యలీలా విగ్రహం ఏ పార్టుకా పార్టు ఎప్పుడు చూద్దామా అని నా కన్నులు టపటప కొట్టుకుపోతున్నాయి. మళ్ళీ ఫస్టు షో వేళయిపోతుంది. ఏం తీసుకున్నా సరే ఈ ఒక్క వరం యియ్యి. ఏదీ నీ మాయ? అనవేం ఒన్ టూ త్రీ అని."

కృష్ణమూర్తి గుర్తుకుతెచ్చుకున్నాడు. తన చరిత్ర అంతటిలోనూ, ప్రేక్షకులు బతుకంతా అయినా సరే వెయిట్ చేసేది ఒకే దృశ్యం కోసం, గోపికా వస్త్రాపహరణం సీనులో ఒక ఎక్స్ట్రా అయినా నీళ్ళలోంచి లేవక పోతుందా అని. ఇన్నాళ్ళకి తెలిసింది, ఏ వయసు అయితేనేం, ప్రతి మొగ ప్రాణీ ఎదురుచూసే విశ్వరూప సందర్శనం ఏమిటో....

"మావయ్యా, జన్మ సాఫల్యమయే కోరిక సెలవిచ్చావు. సెభాష్. దృష్టి అయితే యివ్వగలను కాని మొదటి ఆటకి టిక్కెట్టు తెప్పించడం నా తరం కాదే! ఈ సంగతి తెలిసి నేనూ సరదాపడి భీముడ్ని, ఘటోత్కచుణ్ని క్యూలో నిల బెట్టాను. పచ్చడై పైకి వచ్చేశారు. అది చూడ్డానికి వెళ్ళిన హడావిడిలో నాశంఖం, చక్రం ఎవరో కొట్టేశారు."ధృతరాష్ట్రుడు నవ్వి-

"ఈ సంగతి తెలిసుంటే, వారం రోజుల క్రితమే మా బలగానికి ఫస్టు క్లాసు టికెట్ను అన్నీ రెండొందల ఏభయి మాత్రమే దొరికేయి అనుకో మా శకుని చేత బ్లాక్‌లో తెప్పించాను. నాకు కళ్ళుతెప్పించు. కావాలంటే లంచం యిదిగో నీకో టికెట్టు"

అనడమే తడవుగా ఒన్ టూ త్రీ అనే ముక్కలు వినిపించాయి, ధృతరాష్ట్రుడు కళ్ళు తెరిచేసరికి ఓ టికెట్టు ముక్క లేదు, ఆ నల్లనయ్యా లేడు! అతనెక్కడున్నట్టు?

....ఒకే టికెట్టు దొరికిన కతంబున, 'సిరికిం జెప్పక'; క్యూలో హరియింప బడనందున, 'శంఖు చక్ర యుగంబు చేదువయి సంధింపక', సీటు దొరకదేమో యను భయమున, రయమున జనుచున్నం దున 'అభ్రకపతిం బన్నింపక'.... తేజో లక్ష్మి శరీరాంగాంగ సందర్శనోత్సాహియై మనోవేగమ్మున సినీ గృహమ్ము దెస పరమేశ్వరుండు పర్వెత్తుచుండె.